క్లుప్తంగా

నేడు పెద్దేముల్‌లో ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన



గోపాల్ పార్టీ మండల అధ్యక్షుడు

పెద్దేముల్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా నేడు (సోమవారం) చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిలు పెద్దేముల్ మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించనున్నారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోపాల్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు మండల నాయకులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వేసవితాపం.. నీటితో ఆడుకుంటున్న చిన్నారులు



సేదతీరుతున్న పిల్లలు

ధారూరు: మండుతున్న ఎండలు, వాడగాల్పులకు పెద్దవారు సైతం బెంబేలెత్తిపోతున్నారు. ఇక చిన్నారుల పరిస్థితి చెప్పనక్కర్లేదు. ఎక్కడ చల్లదనం ఉంటే అక్కడికి పరుగుతీస్తున్నారు. ఎక్కడ నీరు దొరుకితే అక్కడికి వెళ్లి ఆడుకుంటున్నారు. నల్లా నీటిని బాటిళ్లలో నింపుకుని ఒంటిమీద పోసుకుంటూ సేదతీరుతున్నారు. మండల పరిధిలోని మోమిన్‌కలాన్ గ్రామంలో ఓ ఇంటి ఆవరణలో ఉన్న నల్లా వద్దకు చేరిన చిన్నరులు నల్లా నీటితో ఆడుకుంటూ, సేదతీరడం కనిపించింది.

పేద కుటుంబానికి చేయూత



ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

పూడూరు: మండల పరిధిలోని తిర్మలాపూర్ పంచాయతీ పరిధిలోని పేదింటి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసినట్లు డీసీసీ ఉపాధ్యక్షుడు పెంటయ్య తెలిపారు. గ్రామానికి చెందిన వడిత్య లక్ష్మీబాయి, రాజునాయక్ కూతురు వివాహానికి హాజరై రూ.11 వేల నగదును పెళ్లికూతురు కుటుంబానికి అందజేశారు. గ్రామంలో ఎలాంటి శుభకార్యం జరిగినా తన వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాములు నాయక్, గోపాల్‌నాయక్, రహీం, పరశురాం, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



వికారాబాద్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో బీజేపీ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేపడుతున్నారు. ఆదివారం బీజేపీ నాయకులు పట్టణంలోని పలువార్డుల్లో తమ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డిని గెలిపించాలని కోరుతున్నారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మూడోసారి బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. ఈ సారి తప్పకుండా చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తామన్నారు. ఎక్కడికి వెళ్లిన ప్రజలు బీజేపీని ఆదరిస్తున్నారన్నారు. దేశంకోసం తప్పకుండా మోదీ నాయకత్వాన్ని కోరుతున్నారన్నారు. నిస్వార్థపరుడు కొండాను గెలిపించి చేవెళ్ల ఎంపీ స్థానాన్ని మోదీకి బహుమతిగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కేపీ రాజు, పోకల సతీష్, బుస్స శ్రీకాంత్, వీరారెడ్డి పాల్గొన్నారు.

'రాతలు' మారవా?



అధికారుల పేర్లు లేని సమాచార హక్కు చట్టం బోర్డు

బొంరాస్‌పేట: ప్రభుత్వాలు, పాలన, అధికార యంత్రాంగం మారుతున్నా కార్యాలయాల్లో గోడలకున్నా సమాచార రాతలు మాత్రం మారడం లేదు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గోడలపై ఉన్న మాజీ ప్రజాప్రతినిధుల పేర్లు, అధికారులు పేర్లు మార్పు చేయకుండా అలాగే ఉండిపోయాయి. అధికారుల పేర్లు లేకుండా సమాచార హక్కు చట్టం బోర్డు ఖాళీగా ఉన్నాయి. నిత్యం కార్యాలయానికి వచ్చి వెళ్లే మండల ప్రజలు, విద్యావంతులు ఆశ్చర్యపోతున్నారు. గోడలపై ఉన్న సమాచారం తప్పు లేక అదే వాస్తవమని నమ్మేస్తున్నారు. అధికారులు స్పందించి తాజా సమాచారం రాయించాలని కోరుతున్నారు.

తెల్లజొన్న.. లాభాలు మిన్న



యాచారంలో సాగు చేసిన తెల్లజొన్న

- పెట్టుబడి తక్కువ ఆదాయం ఎక్కువ
- ఆసక్తి కనబరుస్తున్న రైతులు

బంట్వారం: పెట్టుబడి తక్కువ.. లాభాలు ఎక్కువగా ఉండడంతో తెల్లజొన్న సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. నీటి వసతి ఉన్న రైతులు వేసవిలో తెల్లజొన్న పంట వేస్తున్నారు. బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో సుమారుగా 750 ఎకరాల్లో ఈ ఏడాది సాగు చేశారు. పంట ఆశాజనకంగా ఉండడంతో జొన్న రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సాగు విధానం

మొదటగా దుక్కి దున్నే సమయంలో అవసరం మేరకు డీఏపీ వేయాలి. విత్తనాలు చల్లి నీరు పారిస్తే సరిపోతుంది. విత్తనాలు మొలకెత్తాకా పంట ఏపుగా పెరిగే దశలో కాస్త యూరియా, పొటాష్ కలిపి చల్లితే సరిపోతుంది. కేవలం మూడు నాలుగు సార్లు పంటకు నీరు పెట్టాలి. చీడపీడల బెడద ఉండనే ఉండదు. అవసరాన్ని బట్టి పేనుబంక , కాండం తొలిచే పురుగు నివారణకు ఒకటి రెండుసార్లు వేప నూనే పిచికారీ చేయాలి

పంటకాలం నాలుగు నెలలు

వేసవిలో వేసిన తెల్లజొన్న పంటకాలం నాలుగు నెలలు మాత్రమే. పత్తి ,ఇతరత్ర పంటలు పూర్తయ్యాకా భూమిని చదును చేసి జనవరి, ఫిబ్రవరి మాసాల్లో తెల్ల జొన్న సాగు చేస్తున్నారు. పెట్టుబడి పెద్దగా ఏమీ ఉండదు. ఒకసారి కలుపు తీస్తేచాలని రైతులు అంటున్నారు.

మూడెకరాల్లో సాగు చేశా



మూడెకరాల్లో తెల్లజొన్న సాగు చేశాను. పంట బాగానే ఉంది. పెట్టుబడి రూ.15 వేలు వెచ్చించాను. అవసరాన్ని బట్టి మూడు నాలుగు సార్లు పంటకు నీరు పెట్టాను. ఎకరాకు 10 క్వింటాళ్ల చొప్పున దిగుబడి వస్తుందని ఆశిస్తున్నా. ప్రస్తుతం మార్కెట్‌లో జొన్నలకు మంచి డిమాండ్ ఉంది.. ధర కూడా బాగానే పలుకుతుంది.

– నర్సింలుగౌడ్ ,యాచారం

సామాజిక సేవలో 'ఆలయం'

- వేసవిలో నిత్యం అంబలి పంపిణీ
- దాతల స్ఫూర్తితో 35 ఏళ్లుగా సాగుతున్న వైనం



అంబలి పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

కొడంగల్ రూరల్ : మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో వీరభద్రేశ్వర స్వామివారి ఆలయంలో వేసవికాలం నిత్యం అంబలి పంపిణీ చేస్తూ సామాజిక సేవలో దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొంటున్నారు. గత 35 ఏళ్లగా ఆలయంలో పూజా కార్యక్రమాల అనంతరం అంబలిని పంపిణీ చేస్తున్నారు. దాతలు ఇచ్చే జొన్నలు, శెనిగలు తదితర ధాన్యాలతో అంబలిని తయారు చేస్తున్నారు. కుల మతాలకు అతీతంగా అంబలిని సేవిస్తూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అంబలిని సేవించడంతో ఆరోగ్యంతో పాటు మనసు హాయిగా, ఉల్లాసంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజు 50కిలోల బాండీలో దాదాపు 8నుంచి 10కిలోల జొన్నపిండితో అంబలిని తయారు చేస్తున్నారు. ప్రతి రోజు 100 మందికి పైగా అంబలిని పంపిణీ చేయడం గొప్ప విశేషమని పేర్కొంటున్నారు.

గురుగోవిందానంద సరస్వతీ స్వామివారి సూచనలతో..

గ్రామంలోని వీరభద్రేశ్వర స్వామివారి ఆలయానికి ప్రత్యేక సమయాల్లో శ్రీగురు గోవిందానంద సరస్వతీ స్వామివారు వచ్చి భక్తులకు ప్రవచనాలు చెప్పేవారు. ఆయన సూచిన మేరకు ప్రతి ఏడాది శ్రీరామనవమి రోజున అంబలి కేంద్రాన్ని ప్రారంభించి వేసవి తీవ్రత తగ్గేవరకు పంపిణీ కొనసాగించడం విశేషం. అంబలిని తయారు చేసేందుకు ముగ్గురు మహిళలు సైతం సహకారం అందిస్తూ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

సామాజిక సేవలో నేను సైతం..

దాతలు ఇచ్చే జొన్నలను తన గిర్నిలో ఉచితంగా జొన్న పిండిని తయారు చేస్తూ సామాజిక సేవలో నేనుసైతం అంటూ గ్రామానికి చెందిన మజ్జిబాబ తన వంతు సహకారం అందిస్తున్నారు. అంబలి, జొన్న రొట్టెలు తినడంతో ఆరోగ్యంగా ఉంటారని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

విద్యతోనే ఉన్నత స్థాయికి..



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న చిన్నారులు

పూడూరు: సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే విద్య ఎంతో ముఖ్యమని చన్గోముల్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాత్రి మండలంలోని కడుమూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజ్ఞానంతో కూడిన విద్యను నేర్చుకోవాలంటే పుస్తక పఠనం అవసరమన్నారు. విద్యార్థికి మొదటి మెట్టు పాఠశాల నుంచే ప్రారంభమవుతోందని ఉపాధ్యాయుడే వారికి దిశనిర్దేశం చేస్తారని అన్నారు. సమాజంలో శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసుల పాత్ర ఎంత అవసరమో, సమాజ స్థితిగతులు మార్పు పొందాలంటే ఉపాధ్యాయుని అవసరం చాలా ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పూడూరు నాయబ్ తహసీల్దార్ మోహన్, కాంప్లెక్స్ హెచ్ఎం స్వరూప, పాఠశాల హెచ్ఎం మధు, ఉపాధ్యాయులు హరీశ్‌బాబు, అనూష, ఖాజా, మహిపాల్, మహేందర్, విఠల్ పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ లక్ష్మి, మాజీ చైర్మన్ సత్యనారాయణ, సురేశ్‌కుమార్, అఫ్జల్, మాణిక్యం పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

షాద్‌నగర్: మండల పరిధిలోని రాసుమళ్ళగూడ గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు ఆదివారం బీజేపీ మండల అధ్యక్షుడు దొడల వెంకటేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్, బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో విష్ణువర్ధన్‌రెడ్డి పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమని అన్నారు. బీజేపీకి అఖండ విజయాన్ని అందించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలకు ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారిలో రామకృష్ణ, శివకుమార్, భాను ప్రసాద్, శ్రీశైలం, విష్ణు, అభి, వంశీ, సిద్దార్థ, శ్రీకాంత్, శివకుమార్, సురేందర్, జైకృష్ణ, భానుకుమార్, శివకృష్ణ, ప్రవీణ్, హర్షవర్ధన్, రామస్వామి, శ్రీశైలం, కరుణాకర్ తదితరులు ఉన్నారు.

నామినేషన్ కార్యక్రమానికి రండి

చేవెళ్ల: బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మండల నాయకులు కోరారు. మండల కేంద్రంలో ఆదివారం పార్టీ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా విశ్వేశ్వర్‌రెడ్డి సోమవారం నామినేషన్ వేస్తున్నారని దీనికి చేవెళ్ల ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఉ. 8 గంటలకు అంతా చేవెళ్లలోని కేవీఆర్ గ్రౌండ్‌కు చేరుకుంటే అక్కడి నుంచి అంతా కలిసి ర్యాలీగా కాళీ మందిర్ వద్దకు వెళ్లి అక్కడ పూజలు చేసుకొని రాజేంద్రనగర్‌లోని నామినేషన్ కార్యక్రమానికి వెళ్లాల్సి ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. మోదీ కోసం బీజేపీకి ఓటు వేస్తామని ప్రజలు అంటున్నారని అన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు పాండురంగారెడ్డి, ప్రధాన కార్య దర్శి అనంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శర్వలింగం, శీల్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, రమణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మానిక్యరెడ్డి, వైభవ్‌రెడ్డి ఉన్నారు.

సివిల్స్‌లో సత్తాచాటడం గొప్ప విషయం

దాదాపూర్ మాజీ సర్పంచ్ కృష్ణ



అస్పక్‌ను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ కృష్ణ

దోమ : యువత ఉన్నతమైన లక్ష్యాన్ని ఎంచుకొని సివిల్స్‌లో సత్తాచాటడం హర్షించదగ్గ విషయమని మాజీ సర్పంచ్ కృష్ణ అన్నారు. ఆదివారం దోమ మండలంలోని దాదాపూర్ గ్రామానికి చెందిన అష్పక్ ఇటీవలే విడుదలైన సివిల్స్ ఫలితాల్లో సత్తా చాటారు. ఈ మేరకు గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణ, గ్రామస్తులతో కలిసి అష్పక్‌ను శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత యువత అష్పక్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎంతో పట్టుదలతో ఉన్నమైన చదువులు చదివి సివిల్స్ ఫలితాల్లో 770 ర్యాంక్ సాధించడం గొప్ప విషమన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి పట్టుదలతో చదివినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ గఫార్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం.. బండబావి ఆంజనేయస్వామి

- రేపు జయంతి వేడుకలు
- ముస్తాబైన ఆలయం



బండబావి ఆంజనేయస్వామి ఆలయం

అనంతగిరి: వికారాబాద్ పట్టణం నుంచి అనంతగిరిగుట్టకు వెళ్లే మార్గంలో కొలువైన బండబావి ఆంజనేయస్వామి భక్తులకొంగు బంగారంగా విరాజిల్లుతున్నాడు. ఈ ప్రాంతంలో అతిపురాతనమైన ఆంజనేయస్వామి ఆలయాల్లో బండబావి ఒకటి. ఈ ఆలయంలో మొక్కుంటే కోర్కెలు తీరుతాయని నమ్మకం. ఆలయంలో ప్రతి సంవత్సరం ఆంజనేయస్వామి జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగానే రేపు జరిగే ఉత్సవాలకు ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలు, పెంటింగ్ అలంకరించారు.

విజయవంతం చేయాలి

బండబావి ఆంజనేయస్వామి ఆలయంలో ఉ. 6గంటలకు సుప్రభాత సేవతో పూజలు ప్రారంభమవుతాయని అర్చకులు తెలిపారు. ఉ.6–30గంటలకు పంచామృత అభిషేకం, 7.30 గంటలకు మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ ఉంటుందన్నారు. అలాగే 10.30గంటలకు స్వామి వారి పల్లకీ సేవ, మధ్యాహ్నం 12గంటలకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 5 గంటలకు ఊయల సేవ నిర్వహించనున్నారు. కావున భక్తులు, పట్టణ ప్రముఖులు, ప్రజలు, మహిళలు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు కోరుతున్నారు.

ప్రత్యేక పూజలు

బండబావితో పాటు పట్టణంలోని పాతగంజ్ హనుమాన్ మందిరం, ఆలంపల్లి, శివరాంనగర్, రామయ్యగూడ, కొత్తగంజ్, సుభాశ్‌నగర్ తదితరు వాడల్లో వెలిసిన ఆంజనేయ స్వామి ఆలయాలతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో తెల్లవారు జామునుంచే ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, అన్నదానాలు భజనలు రాత్రి వరకు ప్రత్యేక పూజలు కొనసాగనున్నాయి. అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తి చేస్తున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపిస్తే మన ప్రాంతంలో మరింత అభివృద్ధి జరుగుతుందని ఆ పార్టీ నాయకులు శైలజ, సమత, దేవర వెంకట్‌రెడ్డి, ఆగిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వీరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌లు అన్నారు. మండల కేంద్రంలోని పలు కాలనీల్లో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని గెలిపించాలని చేయి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నారని, ఇప్పుడు ఎంపీ అభ్యర్థిని కూడా మనం గెలిపించుకుంటే అభివృద్ధి జరిగే అవకాశం ఉంటుందని చెప్పారు. ఇతర పార్టీల వారి మాయ మాటలు నమ్మి మోసపోవద్దని చెప్పారు. ప్రస్తుత ఎంపీగా ఉన్న రంజిత్‌రెడ్డి ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ద్వారా రాబోతున్నారని ఆయనను గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మద్దెల శ్రీనివాస్, పెంటయ్యగౌడ్, రాములు, గంగి యాదయ్య, మల్లారెడ్డి, అనంతరాములు, ప్రభాకర్, సూర్యపేట శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, పాండు, రాములు, తదితరులు ఉన్నారు.

హరితహారం మొక్కలకు నిప్పు



తాండూరు- జహీరాబాద్ రోడ్డుపై కాలిపోయిన మొక్కలు

పెద్దేముల్: పెద్దేముల్ మండల తట్టెపల్లి గ్రామ శివారులో తాండూరు- జహీరాబాద్ ప్రధాన రహదారి పక్కన హరితహారంలో నాటిన మొక్కలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పటించడంతో సుమారుగా ఇరువైకి పైగా కాలిపోయాయి. గతంలో కూడా ఇదే ప్రాంతంలో చెట్లకు నిప్పటించడంతో పంచాయతీ కార్యదర్శి మళ్లీ కొత్త మొక్కలను నాటారు. మళ్లీ అదే చోట చేతికి వచ్చిన మొక్కలకు నిప్పటించడంతో సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారని గ్రామ ప్రజలు మండిపడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం, తనిఖీలు సక్రమంగా లేకనే హరితహారం పథకం మండలంలో నీరుగారిపోతోందని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అలాగే, హన్మాపూర్, పెద్దేముల్‌లో నాగులపల్లి రోడ్డు వెంబడి నాటిన మొక్కలు నామరూపాలు లేకుండా ఎండిపోయాయి. ప్రభుత్వం లక్షల రూపాయాలు ఖర్చుపెట్టి హరితహారం నిర్వహిస్తున్నా ఏమి లాభం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా నాటిన ప్రతి మొక్క బతికేలా చూడాలని మండల ప్రజలు అంటున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ జర్నప్పను వివరణ కోరగా కాలిపోయిన మొక్కలను పరిశీలించి, ఆ స్థానంలో కొత్త మొక్కలను నాటడంతో పాటు ఎలా జరిగిందో పూర్తి విచారణ చేస్తామన్నారు.

ప్రమాదం జరిగినప్పుడే స్పందిస్తారా!

- పొలంలో ప్రమాదకరంగా విద్యుత్‌వైర్లు
- సంగెంకలాన్‌లో ఓ రైతు ఆవేదన



వైర్లు చేతికి అందుతున్నాయని చూపిస్తున్న రైతు

తాండూరు రూరల్: విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు మరమ్మతులు చేయాలని అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మండలంలోని ఆయా గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. తాండూరు మండలం సంగెంకలాన్ గ్రామంలోని సర్వే నంబర్ 70లో సుభాశ్‌రావు అనే రైతు పొలం ఉంది. ఈ పొలం మీదుగా విద్యుత్‌వైర్లు వెళ్తున్నాయి. విద్యుత్ స్తంభాల మధ్య దూరం ఉండటంతో వైర్లు వేలాడుతున్నాయి. పొలంలో నిలబడితే చేతికి అందుతున్నాయని రైతు చెబుతున్నారు. పొలం పనులు చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. వర్షాకాలంలో గాలులకు వైర్లు పొలంలో పడి రైతులు చస్తేనే స్పందిస్తారా అంటు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి పొలంలో కిందికి ఉన్న విద్యుత్‌వైర్లు మరమ్మతులు చేయాలని రైతుల కోరుతున్నారు.

మిత్రుడికి ఆత్మీయ సన్మానం



రాములును సన్మానిస్తున్న మిత్రులు

కొడంగల్ : మండలంలోని పర్సాపూర్ గ్రామానికి చెందిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ తట్టెపల్లి రాములును కొడంగల్‌కు చెందిన ఆయన స్నేహితులు ఆదివారం సాయంత్రం శాలువా పూలదండతో సత్కరించి, మెమోంటో అందజేశారు. తట్టెపల్లి రాములు ఈనెల 30వ తేదీన ఉద్యోగ విరమణ చేయనున్నారు. 30 ఏళ్ల పాటు ఆయన అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. పేద విద్యార్థులకు అందుబాటులో ఉంటూ వారిని అక్కున చేర్చుకున్నారని పేర్కొన్నారు. తన జీవితంలో ఎక్కువ సమయం విద్యార్థులతోనే గడిపారని కొనియాడారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు బాకారం సాయప్ప, మేడిపల్లి రాములు, నీటూరు బషీర్, దేవరకొండ రమేష్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, మల్లయ్య, మొగులప్ప, విష్ణుకుమార్, నారాయణ, లక్ష్మణ్, వెంకటప్ప, హకీం బాల్‌రాజ్, బసప్ప, మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

వంతెనలు అంతేనా?



కొందుర్గు మండలం టేకులపల్లి వద్ద ధ్వంసమైన వంతెన

- శిథిలమై కుంగిపోతున్న కల్వర్టులు
- వర్షాకాలం వస్తే భయం గుప్పిట్లో స్థానికులు
- పట్టించుకోని అధికారులు

కొందుర్గు: పలు గ్రామాల్లో లోలెవల్ వంతెనలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. కల్వర్టులను విస్తరించడం, వాటిని బాగుచేయడంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతీ వర్షాకాలంలో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలతో గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. రోజుల తరబడి బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. వర్షాకాలం వచ్చిందంటే లోలెవల్ వంతెనకు ఇరువైపు ఉన్న గ్రామాల ప్రజలు భయపడాల్సి వస్తోంది. వాగులు, వంకలు పొంగి వరద నీరు లోలెవల్ వంతెనలపై ఎక్కడ ప్రవహిస్తోయో రాకపోకలు ఎక్కడ నిలిచిపోతాయోనని ఆందోళన చెందడం పరిపాటిగా మారిపోయింది. వంతెనలు దెబ్బతినడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదివరకే చాలామంది వాహన చోదకులు కిందపడి ప్రమాదాలకు గురయ్యారు.

కొందుర్గు మండలం టేకులపల్లి గ్రామానికి వెళ్లేదారిలో ఉత్తరాసిపల్లి–టేకులపల్లి మధ్య వాగుపై నిర్మించిన వంతెన పూర్తిగా ధ్వంసమైంది. జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాల వంతెన వద్ద పగుళ్లు ఏర్పడి రోడ్డు కుంగిపోయింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహించిన సమయంలో రాకపోకలు స్తంభించి ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందిపడ్డారు. ఇక ఈ ఏడాది వర్షాకాలం సమీపిస్తూనే ఉంది. ఈ వర్షాకాలంలో వాగులు ఉధృతితో ప్రవహిస్తే ఈ ఏడాది ఈ వంతెనలు పూర్తిగా వరదల్లో కొట్టుకుపోయే ప్రమాదముందని వాపోతున్నారు. ఇక జిల్లేడ్ చౌదరిగూడ మండలం తూంపల్లి వంతెన, కొందుర్గు మండలం వెంకిర్యాల వంతెన, ఉమ్మెంత్యాల లాలపేట వాగులకు వంతెనలు లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంకిర్యాల వాగుపై వంతెన నిర్మించేందుకు పునాదులు తీసి వదిలేశారని, ఈ రోడ్డు చాలా రద్దీగా ఉంటుందని పేర్కొంటున్నారు. కొందుర్గు మండల కేంద్రం నుంచి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి వెళ్లే డబుల్ రోడ్డుపై వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతాయని, అర్ధాంతరంగా వంతెన నిర్మాణం పనులు ఆపివేస్తే ఎలాగని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దెబ్బతిన్న వంతెనలకు మరమ్మతులు చేయించాలని, వంతెనలు లేని వాగులకు నూతనంగా వంతెనలు నిర్మించాలని కోరుతున్నారు.



జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో కుంగిన రావిర్యాల వంతెన